ఆటో అన్నా.. బతుకు గుండుసున్నా



ఫ్రీ బస్సుతో ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లు
అప్పు చేసి ఈఎంఐలు చెల్లిస్తున్న వైనం
షరతులు లేకుండా వాహన మిత్ర చెల్లించాలని డిమాండ్

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి..



జీవనోపాధి కోల్పోతున్న ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.5 వేలు జీవన భృతి అందజేయాలి. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా రూ. 15 వేలు వాహన మిత్ర కింద షరతులు లేకుండా అందజేయాలి. అధిక జరిమానాలకు కారణమవుతున్న 21, 31 జీవోలు రద్దు చేసి, ప్రైవేటు సంస్థలకు అనుమతి ఇచ్చిన వాహన ఫిట్నెస్ పరీక్షలను రద్దు చేసి ప్రభుత్వ పరిధిలో నిర్వహించాలి. పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.

-జి.వామనమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్

ట్యాక్స్‌ల భారంతో సతమతం..



కష్టాల్లో ఉన్న ఆటో కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. మోటారు రంగంపై మోపిన ట్యాక్స్‌ల భారం తగ్గించాలి. ఏదో వంకతో ఆటో, ట్యాక్సీలపై చీటికీ మాటికీ జరిమానాలు విధించడం అన్యాయం. ఇప్పటికే ప్రభుత్వం పెంచిన ట్యాక్సులు చెల్లించలేక, ఆటోలు నడపలేక అమ్ముకోవాలని చూస్తున్నారు. పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలి.

- గార తాతబ్బాయి, ఆటో డ్రైవర్

అల్లిపురం: స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలకు గిరాకీ తగ్గిందని, ఆటో యజమానులు, డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని జీవనోపాధి కల్పించాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. చాలా మంది ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు లేకపోవడంతో జీవనోపాధి కోసం ఆటోలు నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రతిరోజు రూ.500 వరకు సంపాదించుకునే తమకు ఇప్పుడు రూ.100 కూడా రావడం లేదని వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో యజమానులు, డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం కోసం నిరీక్షణ..

బస్టాప్‌ల వద్ద నిల్చున్న మహిళలను ఆటో ఎక్కమని అడిగితే ఆధార్ కార్డులు చూపిస్తున్నారని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు, మరో పక్క ఉబర్, ఓలా , ర్యాపిడో వంటి సర్వీసులతో 40 శాతం ఉపాధి కోల్పోయామని, ఇపుడు చంద్రబాబు ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకంతో మరో 30 శాతం ఉపాధి నష్టపోయి రోడ్డున పడ్డామని డ్రైవర్లు వాపోతున్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంధన ధరలు, నిత్యావసర సరుకుల ధరలు, వాహన విడి భాగాల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పిన చంద్రబాబు ఎన్నికల హామీని తక్షణం అమలు చేయాలంటున్నారు. గత 13 నెలలుగా దీని కోసం ఎదురు చూస్తున్న తమకు ఎటువంటి షరతులు, నిబంధనలు లేకుండా ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆటోడ్రైవర్ల ఉపాధికి భరోసా కల్పించేలా ప్రతి నెలా కనీసం రూ.5 వేలు జీవనభృతి చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు. అలాగే డ్రైవర్ల కోసం పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలంటున్నారు.

డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి..



ఫైనాన్స్‌తో ఆటో కొని నడుపుతూ ఇంటి అద్దె, పిల్లల చదువులు, కుటుంబ పోషణ చేస్తున్నాను. స్త్రీశక్తి పథకంతో మా బతుకులు రోడ్డున పడ్డాయి. బేరాలు లేక ఆదాయం కోల్పోయాం. బండి ఈఎంఐ ఎలా కట్టాలో తెలియడం లేదు. భార్యా పిల్లలకు కడుపునిండా తిండి పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. జీవన భృతి చెల్లించి ప్రభుత్వమే ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి,

-ఎం.సుధీర్, ఆటో డ్రైవర్

బతుకు దుర్భరం..

ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని ఆటో, క్యాబ్, మ్యాక్సీ, జీపులు కొనుగోలు చేసి ప్రజలకు రవాణా సేవలందిస్తూ ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆటో డ్రైవర్ల బతుకు దుర్భరంగా మారింది. బేరాలు లేక ఆటో స్టాండ్‌లో దిగాలుగా చూస్తున్నారు. నెల అయ్యేసరికి బండి ఫైనాన్స్, ఈఎంఐ ఎలా కట్టాలి? ఇంటి అద్దె, పిల్లల ఫీజులు ఎలా కట్టేదని ఆవేదన చెందుతున్నారు. దక్షిణ నియోజవర్గంలో సుమారు 10 వేల మంది ఆటో, క్యాబ్, మ్యాక్సీ డ్రైవర్లు ఉన్నారు. ప్రస్తుతం వారి బతుకు అగమ్యగోచరంగా మారింది.



బేరాలు లేక అల్లిపురం ఆటో స్టాండులో నిలిపి ఉన్న ఆటోలు

ఇల్లు గడవడం కష్టంగా ఉంది..



పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాక డ్రైవర్లు చాలా నష్టపోయారు. దానికి తోడు ఉబర్, ఓలా, ర్యాపిడోతో బేరాలు పోయాయి. ఇపుడు ఫ్రీ బస్సుతో మూడొంతులు బేరాలు పోయాయి. మరో పక్క జరిమానాలు, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, గ్రీన్ టాక్స్ పెంచేశారు. అరకొర ఆదాయంతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. ఈఎంఐల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– పిల్లి సత్తిబాబు, ఆటో డ్రైవర్, కొబ్బరితోట

హామీలు అమలు చేస్తే మేలు..



పెరిగిన పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. రోజంతా కష్టపడి ఆటో నడిపితే వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. అప్పులు చేసి కొనుగోలు చేసిన ఆటో రుణాలు, పెరిగిన ట్యాక్సులు చెల్లించలేక సతమతమవుతున్నాం. ప్రభుత్వమే ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి.

– కె.అప్పారావు, ఆటో డ్రైవర్, అల్లిపురం



క్లుప్తంగా

ఘనంగా దాసరి కల్చరల్ అకాడమీ వార్షికోత్సవం



అవార్డులు ప్రదానం చేస్తున్న అతిథులు

అల్లిపురం: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ 37వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డుల ద్వారా కళాకారులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. కళా పరిషత్ ద్వారా భాస్కరరావు 37 సంవత్సరాల నుంచి సేవలందిస్తున్నట్టు పేర్కొన్నారు. గౌరవ అతిథి సన్‌మూర్తి మాట్లాడుతూ కళాకారులకు పుట్టినిల్లు ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఫిల్మ్ డైరెక్టర్ దుగ్గివలస దివాకర్, కొల్లూరు సత్యనారాయణ, సన్ మూర్తి, వ్యవస్థాపకుడు పీఏ భాస్కరరావు ప్రముఖ మిమిక్రీ కళాకారుడు సిల్వెస్టర్, అత్తర్ తిరుపతి నాయుడు, రుద్ర ప్రసాద్, డాక్టర్ సూర్యనారాయణ తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి సత్యనారాయణ, ఎంపీ సుబ్రహ్మణ్యం, భీశెట్టి, మదీనా తదితరులు పాల్గొన్నారు.

2న సంగీత విభావరి

జగదాంబ: లతా మంగేష్కర్ జయంతిని పురస్కరించుకుని సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు యాక్మి సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు యాక్మి ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అక్టోబర్ 2వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు హిందీ గాయని గుల్ సక్సేనాచే లైవ్ ఇన్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నామన్నారు. శామ్యూల్ జాన్ సంగీత సారథ్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించినట్లు తెలిపారు. లతా మంగేష్కర్ అభిమానులు, నగర ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

సినీ ఏజెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో సినీ ఏజెంట్లు

సీతంపేట: తెలుగు సినీ, టీవీ డిజిటల్ జూనియర్ ఆర్టిస్ట్స్ ఏజెంట్స్ యూనియన్ ఆంధ్ర రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో జరిగాయి. యూనియన్ అధ్యక్షుడిగా నీలాపు వీరాంజనేయరెడ్డి, కార్యదర్శిగా వియ్యపు ఎర్రాజి, కోశాధికారిగా కుక్కల రవి కిరణ్ ఎన్నికయ్యారు. రాష్ట్రం నలుమూలల రాజమహేంద్రవరం, తిరుపతి, రామచంద్రాపురం, కాకినాడ జిల్లాల నుంచి ఏజెంట్లు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఏజెంట్స్ యూనియన్ హెడ్ ఆఫీస్ (హైదరాబాదు) అధ్యక్షుడు ఆర్.ఆర్.నాయుడు ప్రకటించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవిశంకర్, కోశాధికారి రాజ్‌కుమార్, తెలుగు సినీ, టీవీ డిజిటల్ జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు డి.స్వామిగౌడ్, సినీ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ బండారు ఈశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

గణనాథుని అనుపోత్సవానికి వాసుపల్లి విరాళం



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని భారీ గణనాథుని అనుపోత్సవానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, వరసిద్ధి వినాయక పూజా కమిటీ సభ్యులకు రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఎంతో వైభవంగా నిర్వహించే స్వామి నిమజ్జనం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆరవ వార్షికోత్సవంలో స్వామిని లంబోదరుడిగా దర్శనం కల్పించారన్నారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాల్లో తనని కూడా భాగస్వామ్యం చేయడం పట్ల కమిటీ సభ్యులు, నీలాపు సర్వేశ్వరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిట్టిబోయిన శివశంకర్, పెద్దాడ రమణమ్మ, అంగటి కుమారి, సాడి వరలక్ష్మి, సంపంగి చిన్ని, బి. వెంకటి, పి.రవణమ్మ, పద్మనాభం రాజా, పరశురాం, పాల సూర్యప్రకాష్‌రెడ్డి, రమణ స్థానికులు పాల్గొన్నారు.

17న విశాఖలో మెగా రక్తదాన శిబిరం



మాట్లాడుతున్న పరిషత్ సభ్యులు

దాబాగార్డెన్స్: ఈ నెల 17న విశాఖలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు తెరపాంత్ యువక్ పరిషత్ విశాఖ శాఖ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం దాబాగార్డెన్స్ ఆదాయపు పన్ను శాఖ కార్యాలయ రోడ్డులో ఉన్న పరిషత్ కార్యాలయంలో కమిటీ సభ్యులు వివరాలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఈ మహా రక్తదానం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూడా సొంతం చేసుకున్నట్టు తెలిపారు. విశాఖలో ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఈ శిబిరం ద్వారా రక్తం సేకరించి అందిస్తామని తెలిపారు. విశాఖలో నిర్వహించే ఈ మహా రక్తదానంలో సుమారు 2500 యూనిట్ల రక్త సేకరణే లక్ష్యమని తెలిపారు. ఒక్క విశాఖలోనే 60 కేంద్రాల్లో ఈ రక్తదానం నిర్వహించనున్నట్టు చెప్పారు. దేశ వ్యాప్తంగా జరిగే ఈ మెగా క్యాంప్‌కి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయాలని పరిషత్ విశాఖ సభ్యులు కోరారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటు

అల్లిపురం: సారథ్యం పేరుతో విశాఖలో నిర్వహించిన బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉత్తరాంధ్ర ప్రజలకు బీజేపీ చేసిన ద్రోహాన్ని కప్పిపెట్టి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు ఆర్థిక సహాయం ప్రకటించి మోదీ ప్రభుత్వం ప్లాంటును ఆదుకుందన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్టీల్ ప్లాంట్లకు గనులు కేటాయించి, విశాఖ ఉక్కుకు మాత్రమే సొంత గనులు కేటాయించకుండా నష్టాల పాలు చేసిందన్నారు. స్ట్రాటజిక్ సేల్ పేరుతో 100 శాతం అమ్మకానికి పెట్టి, 2000 మంది పర్మినెంట్ కార్మికులను, 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి, ప్లాంట్‌లోని 6 వేల ఖాళీలు భర్తీ చేయలేదన్నారు. ప్లాంట్ రక్షణ కవచాలైన ఫైర్ అండ్ సేఫ్టీ, సీఐఎస్ఎఫ్ విభాగాలను సైతం ప్రైవేటీకరించడం విశాఖ ఉక్కును ఆదుకోవడమా.. ధ్వంసం చేయడమా అని ప్రశ్నించారు. ఇలా అనేక అంశాల్లో మోదీ ప్రభుత్వం ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేస్తున్నందన్నారు. ఈ ద్రోహాన్ని కప్పిపుచ్చి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అభివృద్ధి ప్రగల్భాలు పలకడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా వీరు ప్రజాద్రోహాన్ని ఆపి, విశాఖ స్టీల్ ప్లాంట్, ఉత్తరాంధ్ర అభివద్ధికి కృషి చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులదే ముఖ్య పాత్ర



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులది అత్యంత ముఖ్యమైన పాత్ర అని నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ద్వారానే విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలరన్నారు. విద్యార్థుల మేధస్సుకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయుల బోధన సాగాలన్నారు. కృష్ణ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే క్రమశిక్షణ, అంకితభావం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన తిరుమల శ్రీదేవి, రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొందిన జి.కుమార స్వామి, జి.ఎం.సుజాత, ఎం.మోహనరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ అత్తిలి సుధాకర్, బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు, రచయిత ఆర్.శివకుమార్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బి.కె.కామేశ్వరి, బీవీఎఫ్ కన్వీనర్ జ్ఞానేశ్వర్ బాబ్జి, అధ్యాపకులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి నిత్యావసర సరకులు అందించారు. 16 మందికి బియ్యం, ఇతర సరకులను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఎస్.భానుప్రకాష్, గౌరవ అధ్యక్షుడు డి.ప్రసాద్ రాజు, అధ్యక్షుడు ఎస్.సీతారామకృష్ణ, ఉపాధ్యక్షులు కేవీఎస్ ప్రసాద్, డి.వరప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శి వై.త్రిమూర్తులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కళాకారులతో సాంస్కృతిక వైభవం



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో 'టాలెంట్ హంట్' పేరిట ఆదివారం నృత్య పోటీలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కళాకారులతో సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. నృత్య కళాకారులు నాట్యగురువులు చెప్పే ప్రతి అంశంపై చక్కటి అవగాహన పెంపొందించుకుని చక్కని నృత్య కళాకారులుగా ఎదిగి రాణించాలన్నారు. ఈ సందర్భంగా నృత్య కళల అభివృద్ధికి కృషి చేస్తున్న జి.రాజేశ్వరి, ఎం.రాజేశ్వరి, భవ్య రాశి, కల్యాణ్, నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు, విజేతలకు జ్ఞాపికలను గాయకులు మహ్మద్ తాజ్, మహ్మద్ షకీల్ అందజేశారు. కార్యక్రమంలో నృత్య గురువులు, కళాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న స్థానికులు, యూత్ సభ్యులు

దాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధి 29వ వార్డు సెంచరీక్లబ్, వంకల వీధి యూత్ ఏర్పాటు చేస్తున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట వేశారు. ప్రముఖ సంఘ సేవకుడు మన్యాల శ్రీనివాస్ రాట కార్యక్రమంలో పాల్గొని అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గణపతి నిమజ్జనాలు



31వ వార్డులో లడ్డూ వేలం పాటలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

అల్లిపురం: నియోజకవర్గంలో పలుచోట్ల ఘనంగా వినాయకుని నిమజ్జన మహోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సినీ ప్రముఖులు సత్యానంద్ పాల్గొన్నారు. 31వ వార్డు పరిధిలో సీమా వరనాగేశ్వరరావు దంపతులు, సీమా దినేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుని నిమజ్జనంలో జరిగిన వేలం పాటలో లడ్డూ పొందిన యువకునికి నిర్వాహకులు లడ్డూ అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కూటమి శ్రేణులు, స్థానికులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె.ఎస్.చలం

సీతంపేట: దళిత బహుజనులు ఏకం కావాలని, హక్కుల కోసం ఐక్య ఉద్యమమే మార్గమని ద్రావిడ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం అన్నారు. భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో బహుజనులారా మీరు ఎటువైపు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. బహుజనులంతా అనేక పార్టీల కింద విభజించి ఉన్నారని, వారంతా ఏకమై హక్కుల సాధన, రాజ్యాధికారం దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, పెరియార్ రామస్వామి కలిసి దేశమంతా తిరిగి ఉద్యమాన్ని నిర్మించారన్నారు. రిజర్వేషన్లు తొలిసారి తమిళనాడులో అమల్లోకి వచ్చాయని, వాటికి ఆటంకం ఏర్పడితే 1951లో రాజ్యాంగ సవరణ జరిగిందన్నారు. సిక్కోలు బుక్ ట్రస్టు సంపాదకుడు దుప్పల రవికుమార్ అస్తిత్వ స్పృహ అనే అంశంపై మాట్లాడుతూ భారతదేశం 6300 కులాలుగా, ఎస్సీ, ఎస్టీ, బీసీలను చీల్చి వేసి వారి మధ్య ఐక్యత లేకుండా విష సంస్కృతిని సృష్టించారన్నారు. అనంతరం సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వసంత రాజేంద్రప్రసాద్, కె.చిన్నారావు, కనకరాజు, మధు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై నిజాలే చెప్పాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు సీపీఐ నేతల డిమాండ్

అల్లిపురం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ విశాఖ ఉక్కు కర్మాగారంపై ప్రజలకు నిజాలు మాత్రమే చెప్పాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్ కోరారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకుంటున్నట్లు చెబుతున్నారని అన్నారు. అయితే విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తుందని వామపక్ష పార్టీలు అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని మాధవ్ చెప్పడాన్ని వారు తప్పుబట్టారు. ఉక్కులో 43 విభాగాలను ఒక్కొక్కటి ప్రైవేట్ పరం చేసి కార్మికులను తొలగించడం అబద్ధమా? అని వారు ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తాం అని విశాఖ వచ్చిన మీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డాతో ప్రకటన చేయించండి అని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును విస్మరించి ప్రైవేట్ రంగంలో నెలకొల్పుతున్న ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టల్ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం ఏ రకమైన అనుమతులు ఇవ్వలేదని చెప్పించండి. నవరత్న హోదా కలిగిన విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి అన్ని రకాలుగా కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పించాలని కోరారు.